# ప్రజాపక్షం

# జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శుక్రవారం | 04 జులై, 2025 | పేజీలు : 08


## బీటీ రోడ్ల నిర్మాణంతో తీరనున్న ప్రయాణ ఇబ్బందులు



2 లో



# విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

## సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల,గురుకుల జూనియర్ కళాశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు సమకూర్చి విద్యార్థుల అడ్మిషన్లు పెంచాలని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. గురవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ,సంక్షేమశాఖల అధికారులు.ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాలతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈసమావేశం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఎడ్యూకేషన్ కమీషనర్ నుండి మంజూరైన నిధులను కళాశాలలకు పెయింటింగ్స్ ,టెబుల్స్, డ్యూయల్ డెస్క్ ,విండోస్ రిపేర్ చేయించుకోవాలని అధికారులకు తెలిపారు. ఇంజనీరింగ్ ఏజెన్సి నిర్వహించే అన్ని పనులు నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. అత్యవసర తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేస్తానన్నారు. ఇందుకోసం ఏజెన్సీకి కావాల్సిన వారికి ఎస్టిమేట్ చేయాలని ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుండి కళాశాలకు రావటానికి బస్సు సౌకర్యం కోసం అయా కళాశాలలు ప్రిన్సిపాల్స్, ఆర్టీసి అధికారులతో సమావేశం నిర్వహించి కావాల్సిన రూట్ల కు బస్సుసౌకర్యం , కొన్ని కళాశాలలకు బస్సు పరిధి పెంచేందుకు నోట్ తయారు చేసి అయా రీజనల్ మేనేజర్లకు లెటర్ పెట్టాలన్నారు. జూనియర్ కళాశాల,అన్ని హస్టళ్లలో అన్ని సౌకర్యాలు సమకూర్చి ఒక్క సీటు మిగల్చకుండ విద్యార్థులు చేరేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, విద్యార్థుల పట్ల మానవీయ కోణంలో ఆలోచించాలన్నారు. గజ్వేల్ ఎడ్యూకేషన్ హాబ్, కొన్ని కళాశాలల్లో రాత్రి వేళల్లో ఆకతాయిలు చేరి మద్యం తాగుతూ, కిటికిలు, డోర్స్, టాయ్‌లెట్లు ఇతరత్రా ఆస్తులు ధ్వంసం చేస్తున్నారని తెలుపగా సిసి కెమెరాలు పిట్టింగ్ చేయించుకోవాలని పోలీసు అధికారులకు లెటర్ పెట్టి పికెటింగ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థుల భ ద్రతలో రాజీపడవద్దని కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో డిఐఈఓ రవీందర్‌రెడ్డి, డిఆర్డీఓ జైదేవ్,, డిబిసిఓ నాగరాజమ్మ, డిఎస్పీడిఓ కవిత, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్‌లు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ 3వ మహాసభ కరపత్రాల ఆవిష్కరణ



సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నెల్లూరి నాగేశ్వరావు

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:**మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో ఈనెల 5,6 తేదీల్లో నిర్వహిస్తున్న సిపిఐ జిల్లా మూడవ మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు నెల్లూరి నాగేశ్వరావు డోర్నకల్ పట్టణం, రైల్వేష్టేషన్‌లో కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ భూమికోసం, భుక్తికోసం, బానిస బతుకుల విముక్తికోసం నైజం రాచరిక పాలనపై, దోరల, దేశముఖ్, జాగీర్ధార్ల నిరంకుశ దోపిడీ విధానాలపై సిపిఐ నాయకత్వంలో తెలంగాణ సాయుధ పోరాటం జరిగి 4, 500మంది సిపిఐ కార్యకర్తల బలిదానంతో లక్షలాధి ఎకరకాల భూమిని వేలాది గ్రామాలను విముక్తి చేసి ప్రపంచ ప్రఖ్యాత చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ అన్నారు.వందేళ్ళ చరిత్ర కలిగిన సిపిఐ సుదీర్ఘ ప్రయాణంలో శ్రమజీవులు హక్కుల కోసం ప్రజలను నిత్యం చైతన్యపరుస్తూ కురవి మండల కేంద్రంలో జిల్లా మహాసభలు నిర్వహిస్తున్న నేపథ్యంలో కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, యువకులు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు కొదిరిపాక ప్రభేష్, డోర్నకల్ పట్టణ కార్యదర్శి జన్నె స్వామి, ఆర్ శ్రీనివాస్, రామగాని రవి, వీరన్న, రేపాకుల పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు చెందిన అన్ని అంశాలను

# ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



విద్యాశాఖ రివ్యూలో కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** విజయోస్తు 2.0ను పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలకు సంబందించిన ప్రతి అంశాన్ని తప్పక ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, విద్యార్థుల ఉన్నతికై నిరంతరం సమీక్షలు,రివ్యూలు ఉంటాయన్నారు. 2025 –26 పాఠశాలలు ప్రారంభమైన నేపధ్యంలో బడిబాట, యూనిఫామ్స్, పుస్తకాల పంపిణీ, అకాడమీక్ క్యాలెండర్, పది పూర్తి చేసిన విద్యార్థులను ఇంటర్మీడియట్‌లో చేర్పించడం వంటి కార్యాచరణ తదితర అంశాలపై అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, డిఈఓ భోజన్నతో కలిసి సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భవిష్యత్ ఉపాధ్యాయులు మీద ఆదారపడి ఉందన్నారు. విద్యార్దులు ప్రతి రోజు పాఠశాలకు వచ్చే విధఃగా మానటింగ్ చేయాలని, టీచర్స్ అటెండన్స్‌కి సంబందించి ప్రతి రోజు నివేదిక ఇవ్వాలని, అత్యవసరం ఉంటేనే టీచర్లు లీవ్‌లు పెట్టాలని, మధ్యాహ్న భోజనం మీద ప్రత్యేక దృష్టి పెట్టాలని, మెనూ సక్రమంగా అమలు చేయాలని, విద్యార్థులు సీజనల్ వ్యాధుల భారీన పడకుండా చూడాలని, పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచడం, కిచెన్ రూంలు పరిశుభ్రంగా ఉంచడం వంటివి చేయాలన్నారు.

కొత్తగా అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులకు ముందు బేంచ్‌లో కూర్చునేలా చూడాలని, పదవ తరగతి విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో చేరేలా మానిటరింగ్ చేయాలని, జులై 10 లోగా ఏ విద్యార్థి ఏ కళాశాలలో చేరారనే విషాయన్ని తెలియజేయాలన్నారు. పాఠశాల స్థాయి నుండే కేరిర్ గైడెన్స్ ఉండాలని, బాలికలకి బాలురు క్రీడల్లో చురుకుగా పాల్గొనేలా చూడాలని, ప్రతి పాఠశాలలో కనీసం 3 సోక్ పిట్స్ నిర్మాణం చేయాలని, పాఠశాలలో మొక్కలు నాటాలని, నషా ముక్త భారత్ బాగంగా విద్యార్థుల బ్యాగ్‌ల మీద పోకస్ పెట్టాలన్నారు. మండలాల వారిగా మ్యాపింగ్ చేసుకొని అవసరం ఉన్న వాళ్లని హాస్టల్‌లో జాయిన్ చేపించాలన్నారు. ఈ సమావేశంలో కోఆర్డినేటర్లు, పాఠశాల, కెజిబివి, మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ తొర్రూరు :** ఈ నెల 5,6తేదీల్లో భారత కమ్యూనిస్టు పార్టీ మహబూబాబాద్ జిల్లా మూడవ మహాసభల సందర్భంగా కొరవి మండల కేంద్రంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఓమ భిక్షపతి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొరవి మండల కేంద్రంలో ఈ నెల 5న ఐదువేల మందితో నిర్వహించే భారీ బహిరంగ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈనెల 6న ప్రతినిధుల సభ జరుగుతుందని, ఈ ప్రతినిధుల సభకు తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ రామచంద్రనాయక్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ జిల్లా మహాసభల్లో జిల్లా సమగ్రాభివృద్ధి కోసం చర్చించి పోరాటాలు రూపొందిస్తామన్నారు. విద్య, వైద్యం, ప్రజా సమస్యలపై పోరాటాలు రూపొందించుకొని రాబోవు కాలంలో ముందుకు పోతామన్నారు. జిల్లా మహాసభలకు అధిక సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి
డాక్టర్ బి రవి రాథోడ్



ప్రజాపక్షం/గూడూరు: వర్షాకాలంలో అధికంగా వ్యాపించి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్ అన్నారు.గురువారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బొద్దు గొంద ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సబ్ సెంటర్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈసందర్భంగా సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రులలో ఓఆర్ఎస్ ప్యాకెట్ లను మలేరియా గెంగ్యూ సంబంధిత ఆర్ డిటి కిట్లు నిల్వలను సరిచూసుకోవాలని లేనట్లైతే జిల్లా ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లి నిల్వలను సమకూర్చుకోవాలని అన్నారు. వర్షకాలంలో డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ అతిసారం వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని ప్రతి శుక్రవారం డ్రైడెను ప్రజలు పాల్గొనే విధముగా అవగాహన కల్పించాలని ప్రతి ఒక్కరు శుభ్రత పాటిస్తూ దోమల నివారణ చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామస్థాయిలో ఆరోగ్య కార్యకర్తలు ఆశ వర్కర్లు ఇంటింటా వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వర్షాలు ఎక్కువగా వున్నట్లైతే గర్భిణీ స్త్రీలు కాన్పుకు దగ్గరగా వున్నవారిని ఆసుపత్రిలో ముందుగానే చేర్పుకోని ప్రసవం పిదప వారిని పంపించాలని పేరుకొన్నారు.టిబి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగముగా 2025 నాటికి భారతదేశం క్షయ వ్యాధినిర్మూలన దిశగా పురోగతిని వేగవంతం చేయడము లో క్షేత్రస్థాయి సిబ్బంది ప్రజలలో అవగాహన కల్పించి వల్నరబుల్ జనాభాకు క్షయ నిర్ధారణ జరిగితే పూర్తి చికిత్స అందించాలని ఆయన తులిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కె ప్రసాద్ హెల్త్ ఎడ్యుకేటర్ కె వి రాజు ఎం ఎల్ హెచ్ పి ప్రశాంత్ ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తోటి స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



ప్రజాపక్షం/పాలకుర్తి: మండల కేంద్రానికి చెందిన బ్యాండ్ కళాకారుల సంఘం మండల అధ్యక్షుడు ఎండీ అబ్బాస్ అలీ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన కుమారుడు ఎండీ మాశూక్ చిన్ననాటి స్నేహితులు ఆ కుటుంబానికి రూ. 10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. చిన్ననాటి స్నేహితుడు మశూక్ తండ్రి ఆలీ మృతిచెందడంతో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు సోమన్న, శోభన్‌బాబు, రాజు, సునీత, యుగందర్, మధు, కుమార్, మధు, పోతనరావు, గోపిరావు, నాగరాజు, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## నాయకత్వ లక్షణాలు పాఠశాల స్థాయి నుండే అలవర్చుకోవాలి



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పాఠశాల స్థాయి నుండే అలవర్చుకోవాలని నారాయణ విద్యా సంస్థల వరంగల్ డీజీఎం రిజ్వాన అన్నారు. గురువారం జనగామలోని నారాయణ పాఠశాలలో క్యాబినెట్ ఇన్‌స్టలేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వయించారు. ఈ కార్యక్రమానికి నారాయణ విద్యాసంస్థల డీజీఎం రిజ్వాన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలు పాఠశాల స్థాయి నుండే నేర్చుకోవాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ పూర్ణనా మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదువి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. జనగామ సబ్ జైలర్ పి కృష్ణకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటి నుండే కష్టపడితే జీవితంలో మంచి వ్యక్తులుగా ఎదగలుగుతారని, ఆదర్శ భావాలలో పాటు, క్రమ శిక్షణ కలిగిన విద్యార్థులుగా రాణించాలన్నారు. రీజనల్ కోఆర్డినేటర్ శ్రీనివాసచారి, హై స్కూల్ కోఆర్డినేటర్ సాయికృష్ణ, అకాడమిక్ డీన్ విక్రమ్, ఏవో చారి, అన్వర్, ఇమ్రాన్, వైస్ ప్రిన్సిపాల్ రేణుక కిడ్స్ ఇంఛార్జీ శ్రీలేఖతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ

ములుగు నియోజకవర్గ బిఆర్ఎస్ ఇన్‌చార్జి
బడే నాగజ్యోతి

ప్రజాపక్షం/ఏటూరునాగారం:ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అన్యాయాన్ని ప్రశ్నిస్తూ నిజమైన అర్హులైన పేదలకు ఇండ్ల ఇవ్వాలని సోషల్ మీడియాలో ప్రశ్నించిన సోదరుడు ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన చుక్కా రమేష్‌ను కొంత మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీసులకు సమాచారం అందించి వారి ద్వారా అతనిని బెదిరించి సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్న తర్వాత తదుపరి మా నాయకుడు వచ్చాక నీ సంగతి చెబుతామని బెదిరించడంతో మనస్థాపానికి భయానికి గురైన చుక్కా రమేష్ గురువారం ఉదయం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా ఇన్‌చార్జి బడే నాగజ్యోతి చల్వాయి గ్రామానికి మృతుడి కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్తున్న క్రమంలో ఏటూరునాగారంలో పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. అరెస్టును ఖండిస్తూ నాగజ్యోతి మాట్లాడుతూ ఇది ముమ్మాటికి ప్రభుత్వం చేసిన హత్య అని, అర్హులకు పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రశ్నిస్తున్న ప్రతి ఒక్కరిని కాంగ్రెస్ పార్టీ నాయకులు భౌతిక దాడులు చేయడం ఆత్మహత్య చేసుకునే విధంగా మానసికంగా భయభ్రాంతులకు గురి చేయడం ములుగు జిల్లాలో పరిపాటిగా మారిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అ ధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, తుమ్మ మల్లారెడ్డి, తాడూరి రఘు, ఎండి ఖాజా పాషా, కన్నెబోయిన రాజు యాదవ్, వావిలాల కిషోర్ దన్నపునేని కిరణ్, సప్పిడి రా మ్ నర్సయ్య, గండేపల్లి నర్సయ్య, కుమ్మరి చంద్రబాబు, జాడి బోజారావు, తురం పద్మ, వావిలాల ముత్తయ్య, దేపాక శ్రీరామ్, మెరుగు వెంకటేశ్వర్లు, బాసాని శేఖర్, పర్వతాల ఎల్లయ్య, వావిలాల రామ్ నర్సయ్య, తాళ్లపెల్లి మోహన్, బట్టు రమేష్, నూతి రమేష్, చందా లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

## పరిశుభ్రతపై నిరంతర పర్యవేక్షణ : అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:పరిశుభ్రత నిరంతర పర్యవేక్షణ కోసం వంద రోజుల యాక్షన్ ప్లాన్ రూపొందించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ తెలిపారు. గురువారం యాక్షన్ ప్లాన్‌పై మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పింకేష్‌కుమార్ మాట్లాడుతూ జూన్ 2 నుండి సెప్టెంబర్ 10 వరకు వంద రోజుల పాటు ఈ యాక్షన్ ప్లాన్ కొనసాగుతుందనానరు. మున్సిపాల్టీలోని 30 వార్డుల్లో ప్రణాళిక బద్ధంగా పనులు చేపడతామని, లోతట్టు ప్రాంతాలపై దృష్టి పెట్టాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండగా ఫాగింగ్ చేయాలని, సాయినగర్, శివాలం వీది, కుర్మవాడ, అంబేద్కర్ నగర్, గిర్నిగడ్డ, సంజయ్ నగర్, రెడ్డి స్ట్రీట్, గీత నగర్, వీవర్స్ కాలనిల్లోకి కాలువలను శుభ్రం చేయాలన్నారు. ఇంటింటికి చెత్త సేకరణ చేపడుతూ చెత్త చెదారం రోడ్లపైన వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు చేపడుతున్న పనులు ఫోటోలు తీసిని రికార్డుల్లో నమోదు చేయాలని, కూరగాయల మార్కెట్ మాంసపు దుకాణాల వద్ద వ్యర్థాలను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తూ అశ్రద్ధ చేయరాదన్నారు. సాయినగర్, హైదరాబాద్ రోడ్డు, హన్మకొండ రోడ్డుకు ఇరువైపులా పెద్ద కాల్వలను శుభ్రం చేయాలన్నారు. పిచ్చి మొక్కల్ని తొలగించాలని, కమర్షల్ ఏరియాల్లో రాత్రి వేల చెత్త సేకరణ చేపట్టాలన్నారు. జనగామ మున్సిపాల్టీని క్లీన్ టౌన్‌గా అందమైన పట్టణంగా తీర్చిదిద్దాలన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం





ప్రజాపక్షం/జఫర్‌గఢ్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న జాతీయ కార్మిక సంఘాలు 500కు పైగా రైతు సంఘాలు, వ్యవసాయ కూలీలు సంఘాలు, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో సోమయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒంటెద్దు పోకడలతో ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలాయనా న్నరు. ప్రజా పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అన్ని రంగాల సంఘాలు, ప్రజా సంఘాల ప్రజలు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు నక్క యాకయ్య, శ్రీను, సుధాకర్, దర్గయ్య, నర్సింగం, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## బీటి రోడ్ల నిర్మాణంతో తీరనున్న ప్రయాణ ఇబ్బందులు

ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి

ప్రజాపక్షం/ నర్సంపేట : బీటీ రోడ్ల నిర్మాణంతో ప్రజలకు తీరనున్న ప్రయాణ ఇబ్బందులని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి అన్నారు. నర్సంపేట నియోజకవర్గంలోని నర్సంపేట, నల్లబెల్లి మండలాలలో పలు రోడ్లకు, వంతెనలకు ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనగా నిర్మించనున్న రోడ్లు, వంతెనలతో ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయని, వీలైనంత త్వరగా పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మహేశ్వరం నుండి కోనాపురం రోడ్డుపై గురిజాల వద్ద 3 కోట్ల 20 లక్షలతో వ్యయంతో నిర్మించనున్న వంతెన నిర్మాణానికి శంకుస్థాపన, గురిజాల నుండి కోనాపురం వరకు రూ.3 కోట్ల 10 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, జాతీయ రహదారి365 రోడ్డు నుండి అడ్డబాట తండా వరకు రూ.1 కోటి రూపాయలతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, ఆర్‌అండ్‌బి రోడ్డు నుండి చింతగడ్డ తండా వరకు రూ.60 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, ఇటుకాలపల్లి జాతీయ రహదారి 365 రోడ్డు నుండి మేడిపల్లి వరకు రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, రుద్రగూడెం నుండి గుండ్లపహాడ్ వయా గాంధీ నగర్ వరకు రూ.90 లక్షల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

## మొక్కలను విరివిగా నాటాలి

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



ప్రజాపక్షం/దామెర: మొక్కలను విరివిగా నాటాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గురువారం దామెర మండలంలోని ఒగ్లాపూర్ గ్రామంలోని సైలాని బాబా దర్గాలో దర్గా పీఠాధిపతి హజ్రత్ పీర్ హాజీ మహ్మద్ అబ్దుల్ హమీద్ షా మియా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వన మహోత్సవంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్ సభ వాల్ పోస్టర్లు విడుదల



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ భవన్‌లో చలో హైదరాబాద్ పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిసిసి అధ్యక్షులు, పశ్చిమ వరంగల్ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు రేపు హైదరాబాద్ ఎల్బీ స్టేడియం వేదికగా జరుగనున్న సంవిధాన్ పరిరక్షణ శంఖారావం సభ పోస్టర్లు విడుదల చేశారు. హైదరాబాద్ సభ విజయవంతంగా నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు.ఈ సభలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ కార్యకర్తలతో సమావేశమవనున్నారని, కాంగ్రెస్ కార్యకర్తలు తరలిరావాలని కోరారు. ఈ వినూత్న కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, కార్యకర్తలకు నూతన స్ఫూర్తిని అందించడానికి దోహదపడనుందని నేతలు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇంచార్జ్ లుగా నియమితులైన టీపీసీసీ ఉపాధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ,టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు దుద్దిళ్ల శ్రీను బాబు, పల్లె శ్రీనివాస్ గౌడ్, మోత్కూరి ధర్మారావు తో సహ జిల్లా నాయకులు ఈవి శ్రీనివాస రావు, బట్టి శ్రీనివాస్, బంక సరళ, సంపత్, తాడిశెట్టి విద్యాసాగర్, సత్యనారాయణ, కార్పొరేటర్లు, నగర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వంట కార్మికుల హక్కులు సాధించేంత వరకు పోరాటం ఆగదు

### మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ధర్మల రామ్మూర్తి




**ప్రజాపక్షం/ కమలాపూర్:** వంట కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తామని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ధర్మల రామ్మూర్తి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. కార్మికుల హక్కుల సాధన కై ఈనెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనేందుకు కమలాపూర్ మండల వనరుల కేంద్రంలోని అధికారులకు వంట కార్మికులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై 10 కేంద్ర కార్మిక సంఘాల ఇచ్చిన పిలుపులో భాగంగా మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న వంట కార్మికులు సమ్మెలో పాల్గొనేందుకు సిద్ధమయ్యారని అన్నారు. మధ్యాహ్న భోజన పథకం స్థాపించి రెండు దశాబ్ధాలు అయినప్పటికి వంట కార్మికులకు సామాజిక భద్రత, కనీసం వేతనం వంటి పలు డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. 44 కార్మిక చట్టాలను కాలరాసే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తుందని, ఆ చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు కనీస వేతనాలు అమలు చేయాలని అన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. కార్మికుల శ్రమ దోపిడిని అరికట్టేందుకు ఈనెల 9న జరగబోయే దేశవ్యాప్త బంధులో కార్మికులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు వల్లాల లక్ష్మి, మేకల అమృత, మండెద్దుల కమల, సమ్మక్క, రమ, రాజేశ్వరి, సుభద్ర, లక్ష్మి, చిలకమ్మ, కోరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రఘునాథపల్లి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఫణికిషోర్



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** రఘునాథపల్లి తహశిల్దార్‌గా ఎల్ ఫణికిషోర్ మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో గురువారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో జిల్లాలో రెవెన్యూ శాఖలో పలువురు తహశిల్దార్, డిప్యూటీ తహశిల్దార్‌లుగా విధు లు నిర్వహిస్తున్న వారిని బదిలీ చేయగా, మొన్నటి వరకు రఘునాథపల్లి తహశిల్దార్‌గా విధులు నిర్వహించిన మహ్మద్ మౌసిన్ నర్మెట తహశిల్దార్‌గా బదిలీపై వెళ్లగా, బచ్చన్నపేటలో డిప్యూటీ తహశిల్దార్‌గా పనిచేసిన ఫణి కిషోర్ రఘునాథపల్లి తహశిల్దార్‌గా అదనపు బాద్యతలను స్వీకరించడం జరిగింది. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశిల్దార్ ఫణి కిషోర్‌కు రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు.

## ద్విచక్రవాహనాలను బాధితులకు అప్పగించిన పోలీసులు



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు రోజువారీ చేసే వాహన తనిఖీలలో భాగంగా 2024 డిసెంబర్ నెల నుంచి ఇప్పటివరకు దొంగిలించి నడుపుతున్న 10 మోటార్ సైకిళ్లను రికవరీ చేసి, వాటి అసలు యజమానులకు (బాధితులకు) అప్పగించడం జరిగింది. అందులో భాగంగా గురువారం అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ రాయల ప్రభాకర్ రావు మహబూబాబాద్ కి చెందిన ద్విచక్రవాహనాన్ని అట్టి వాహన యజమానికి అందించడం జరిగింది. టిఎస్26 ఎఫ్ 2961 నంబర్ గల ఈ వాహనం దొంగిలించబడింది అని 2022మే నెలలో మహబూబాబాద్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదుచేయబడింది. ఇప్పటి వరకు అప్పగించిన 10 ద్విచక్ర వాహనాలలో 9 వాహనాల పై కరీంనగర్1 టౌన్, కొండాపూర్, సదాశివపేట, రాజన్నసిరిసిల్ల, ఆకివీడు (ఆంధ్రప్రదేశ్), ధర్మసాగర్, సుబేదారి, గోదావరిఖని, మహబూబాబాద్ పోలీస్ స్టేషన్ల లో ఎఫ్ఐఆర్ కాబడినవి. మరొక వాహనం కాటారంకి సంబంధించినది. హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో జరిగిన ఈ కార్యక్రమానికి వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, హనుమకొండ ట్రాఫిక్ సిఐ, ఎస్సై, అధికారులు, సిబ్బంది హాజరవటం జరిగింది.

# మళ్ళీ ఆనాటి రోజులు తెచ్చిన రేవంత్‌రెడ్డి

### పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**ప్రజాపక్షం/పరకాల :** దశాబ్ధాల కాంగ్రెస్ పాలనలో దండగైన వ్యవసాయం పదేళ్ల కేసీఆర్ పాలనలో పండుగైందని, మళ్ళీ ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో దండగైందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలపై మాట్లాడుతూ..బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతును రాజు చేయడమే లక్ష్యంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన కొనసాగించారని, దేశానికే ఆదర్శంగా తెలంగాణ రాష్ట్రాన్ని నిలిపారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ ఏడాదిన్నర కాలం నుండి రైతుల నడ్డివిరిచేలా పరిపాలన సాగిస్తున్నదని విమర్శించారు.రైతుభరోసా రెండు సార్లు ఎగ్గొట్టి, రైతుభీమా పక్కనపెట్టి, రుణమాఫీ తుంగలోతొక్కి, క్వింటాలుకు రూ. 500 బోనస్ కు సున్నంపెట్టి, కల్లాల్లో ధాన్యం కొనకుండా కనీళ్ళు పెట్టించి నేడు రైతులను సంబరాలు చేసుకోమంటారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేసీఆర్ పాలనలో రైతులకు కావాల్సిన విత్తనాలు,ఎరువులు కావాల్సినంత స్టాక్ అందుబాటులో ఉండేవని,మట్టిని నమ్ముకున్న రైతు కుటుంబాలకు రైతు ఎలా మృతిచెందినా రూ.5 లక్షల రైతుభీమాతో ధీమా నిచ్చి,వందశాతం పంటల కొనుగోళ్లతో వ్యవసాయానికి బరోసానిచ్చారన్నారు. నాణ్యమైన 24 గంటల విద్యుత్ సరఫర అందించిన ఘనత కేసీఆర్ ది అని, కానీ నేడు రేవంత్ రెడ్డి పాలనలో ఎరువులకు రైతులు పడిగాపులు కాస్తూ లైన్లో చెప్పులు, చెట్టుకొమ్మలు పెట్టె పరిస్థితి ఉందన్నారు.దేశానికే అన్నంపెట్టే రైతన్నలకు పోలీస్ పహారాలో ఎరువులు పంపిణీ చేస్తున్న చరిత్ర ఈ కాంగ్రెస్ ప్రభుత్వానిదని,రైతు అనేవారు వ్యవసాయం చేయాలా..ఎరువుల కోసం లైన్లో పడిగాపులు కాయలా అని ప్రశ్నించారు.సొసైటీల వద్ద ఒక రైతుకు 5 బస్తాల ఎరువులు కంటే ఎక్కువ ఇవ్వవద్దని కిందిస్థాయి అధికారులకు జిల్లా అధికారులు ఆదేశాలిస్తున్నారని, ఒకవేళ రైతులకు 5 బస్తాలకు ఎక్కువ ఇస్తే కేసులపాలై జైలుకు వెళ్తారని బెదిరిస్తున్న పరిస్థితి నేడు రేవంత్ రెడ్డి పాలనలో ఉందన్నారు.ఇప్పటికైనా ఈ అసమర్థ ప్రభుత్వం కళ్లుతెరిచి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.లేకుంటే కాంగ్రెస్ మోసాలకు రైతుల చేతుల్లో గుణపాఠం తప్పదన్నారు.

# బీటి రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభోత్సవాలు

### నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి




**ప్రజాపక్షం/ నర్సంపేట :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో అభివృద్ధిపై ప్రజలు నిలదీస్తారని హడావుడిగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. నర్సంపేట మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం సిటిజన్ క్లబ్‌లో గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ నేను తెచ్చిన నిధులతోనే నియోజకవర్గంలో బ్రిడ్జిలు, చెక్ డ్యాంలు ,బీటీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ప్రస్తుత ఎమ్మెల్యే చేస్తున్నారని, నేను తెచ్చిన జీవో లు దొంగ జీవోలు అన్న ఎమ్మెల్యే నేడు అదే నిధులతో రోడ్లు వేసి ప్రారంభోత్సవాలు ఎలా చేస్తున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో అభివృద్ధిపై ప్రజలు నిలదీస్తారని హడావుడిగా శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల జిమ్మిక్కుల కోసమే కాంగ్రెస్ నాయకులు సంక్షేమ పథకాలు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు అంటు హడావుడిచేస్తున్నారన్నారు. శిలాఫలకాలు, జీవోలు, ఏజెన్సీ పేరు లేకుండానే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయాల్సిన అవసరం ఏముందో చెప్పాలన్నారు. అభివృద్ధి అంటే లాభం వచ్చే రోడ్ల పనులు మాత్రమే చేయడం కాదు అసంపూర్తిగా ఉన్న రోడ్లు, ఇతర పనులను కూడా పూర్తి చేయాలన్నారు. తండాలకు, గ్రామపంచాయతీలకు నేను తీసుకువచ్చిన రోడ్లను రద్దు చేసిన ఎమ్మెల్యే వాటి పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. గోదావరి నీటిని మాదన్నపేట చెరువుతో అనుసంధానం చేసి ఈ ప్రాంత రైతుల , వ్యవసాయ అభివృద్ధికి పనిచేసినా అన్నారు. పేద ప్రజల వైద్యం, విద్య కోసం, మెడికల్ కళాశాలను, జిల్లా హాస్పిటల్ తీసుకువచ్చానని, ఈరోజు దాన్ని కాపాడుకునే దిక్కు లేకుండా పోయిందన్నారు. నర్సంపేట మండలం ముత్యాలమ్మ తండా, చంద్రాయపల్లి, గురిజాల గ్రామాల నుంచి పలు కుటుంబాలు మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ సమక్షంలో బిఆర్ఎస్‌పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి సాధారంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ, మాజీ జెడ్పిటిసి, మండల పార్టీ కార్యదర్శి, క్లస్టర్ బాధ్యులు, మండల నాయకులు, మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరిశుభ్రతకు నిరంతర పర్యవేక్షణకు 100 రోజుల యాక్షన్ ప్లాన్

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** జనగామ మున్సిపాలిటీలో పరిశుభ్రత కొరకు వంద రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టినట్లు అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తెలిపారు. గురువారం సంబంధిత అధికారులతో 100 రోజుల యాక్షన ప్లాన్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న క్రమంలో లోతట్టు ప్రాంతాలపై ప్రధానంగా దృష్టి పెట్టామని, ముందుగా నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. ప్రజల సహకారంతో ముందుకు పోతూ స్వచ్చత దిశగా జనగామ మున్సిపాలిటీని క్లీన్‌గా అందమైన పట్టణంగా తీర్చిదిద్దుతామన్నారు.

## సమయ పాలన ప్రగతికి సంకేతం



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** సమాజంలోని వ్యవస్థలకైనా, వ్యక్తులకైనా సమయ పాలన పాటించడం ప్రగతికి సంకేతం అని లయన్స్ 320 మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ లయన్ టి రాజేంద్రప్రసాద్ అన్నారు. జనగామ ఆబాద్ లయన్స్ భవన్‌లో జరిగిన ఆబాద్, బి బాయ్స్, కింగ్స్, గ్రేటర్ లయన్స్ క్లబ్‌ల సంయుక్త పదవి ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆబాద్ ప్రస్తుత అధ్యక్షులు నాగేశ్వర రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనగామ ప్రాంతంలో లయన్స్‌క్లబ్‌లు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం క్లబ్ ఆబాద్ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి సురేష్, కోశాధికారి ప్రవీణ్, బాయ్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్, తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌బాధ్యులు లవకుమార్‌రెడ్డి, పరుశరాములు, శారదా దేవి, రమణారెడ్డి, యాదగిరి, కృష్ణజీవన్ బజాజ్, సుభాస్, ప్రమోద్‌కుమార్, సురేష్, రవీందర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, రాజమౌళి, వెంకటనారాయణగౌడ్, బిక్షపతి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మహాసభ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ వరంగల్ :** ఈనెల 6న ఇల్లందులో జరుగే తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం ( ఐఎఫ్‌టియూ)రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య( ఐఎఫ్‌టియూ) వరంగల్ జిల్లా కార్యదర్శి రఘుసాల సుమన్ కోరారు. వరంగల్‌లోని ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ వద్ద గోడ పత్రికల పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ భవన నిర్మాణం కార్మిక సంఘం ప్రథమ మహాసభలు ఈనెల 6వ తేదీన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందలోని పసునూరి రాజు నగర్ నిర్వహించడం జరగుతుందన్నారు. ఈ మహాసభ ప్రారంభానికి ముందు కార్మికులచే ప్రదర్శన, బహిరంగసభ నిర్వహించడం జరుగుతుందన్నారు. అధిక సంఖ్యలో కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుసుమ రమేష్, కందిక సురేందర్, నందన బోయిన కుమారస్వామి, బోళ్ల నగేష్, పిట్టల మల్లేశం, ఆకుపల్లి శ్రీనివాస్, సింగం కుమారస్వామి, జెన్నారం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాశ్రమంలో ఉచిత మెడికల్ క్యాంప్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ నగరంలోని ప్రముఖ వాగ్దేవి విద్యాసంస్థల వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ వారు రంగశాయిపేటలోని ఎలగందుల అమృత స్మారక వృద్ధాశ్రమంలో హనుమకొండ అజరా హాస్పటల్స్ ఆధ్వర్యంలో డాక్టర్ బి సత్యకిరణ్, ఎండి జనరల్ మెడిసిన్ కన్సల్టెంట్ ఫిజిషియన్ వారి అనుసంధానంతో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వృద్ధాశ్రమ నిర్వాహకులు ఎలగందుల రాజేంద్రప్రసాద్, ఎలగందుల శ్రీనివాస్, వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, ఫార్మా డిహెచ్ఓ డి డాక్టర్ బిఎస్ శరవణభవ డాక్టర్ పి గిరిజ, అధ్యాపకులు జ్యోతి ప్రజ్వలన చేసి క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఎలగందుల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వృద్ధులకు ఇటువంటి సేవలు చేయడం అభినందనీయమని, ఇంకా మరెన్నో కార్యక్రమాలు నిర్వహించవల్సిందిగా వాగ్దేవి కళాశాల వారిని కోరారు. ఈ కార్యక్రమంలో 100 మంది వృద్ధులకు మొదట మెడికేషన్ హిస్టరీ ఇంటర్వ్యూ నిర్వహించి డాక్టర్ బి సత్యకిరణ్‌తో పరీక్షింపజేసి వారికి ఉచితంగా మందులను పంపిణీ చేసి పేషెంట్ కౌన్సిలింగ్ నిర్వహించి మెడికేషన్ అడహరెన్స్ తీసుకోవాల్సిన ముఖ్యమైన జాగ్రత్తలు వివరించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు తమ ఇంటి నుండి తీసుకొచ్చిన బియ్యాన్ని అందజేశారు. వృద్ధులకు దుప్పట్లు పంచారు. ఈ క్యాంపును నిర్వహించినందుకు కళాశాల సెక్రటరీ డాక్టర్ చందుపట్ల దేవేందర్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సిహెచ్ వాహినీదేవి, హెచ్ఓడి బిఎస్ శాలువాతో సత్కరించి పాల్గొన్న ఫార్మాడి, బి ఫార్మసి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె శ్రీనివాస రెడ్డి, హెచ్ఓడి ఫార్మకాలజీ ఈ వెంకటేశ్వర్లు, హెచ్ఓడి ఫార్మాడీ బిఎస్ శరవణభవ, పి గిరిజ, ఏ మకరంద్, సఫియానసీర్, జి లావణ్య, వి స్నేహప్రియ, విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రమేష్ మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి

### ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు కోగిల మహేష్



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** రమేష్ మృతికి కారకులైన కాంగ్రెస్ పార్టీ నాయకులను కఠినంగా శిక్షించాలని ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు కోగిల మహేష్ డిమాండ్ చేశారు. గురువారం జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించి ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అన్యాయాన్ని ప్రశ్నిస్తూ నిజమైన అర్హులైన పేదలకు ఇవ్వాలని సోషల్ మీడియాలో ప్రశ్నించిన సోదరుడు ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన చుక్కా రమేష్‌ని కొంత మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీసులకు సమాచారం అందించి వారి ద్వారా అతనిని బెదిరించి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్న తర్వాత తదుపరి మా నాయకుడు వచ్చాక నీ సంగతి చెప్తానని బెదిరించడంతో మనస్థాపానికి భయానికి గురైన చుక్కా రమేష్ గురువారం ఉదయం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడరన్నారు. ఇది ముమ్మాటికి ప్రభుత్వం చేసిన హత్య అని అర్హులకు పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రశ్నిస్తున్న ప్రతి ఒక్కరిని కాంగ్రెస్ పార్టీ నాయకులు భౌతిక దాడులు చేయడం ఆత్మహత్య చేసుకునే విధంగా మానసికంగా భయభ్రాంతులకు గురిచేయడం ములుగులో పరిపాటిగా మారిందన్నారు. ఇప్పటికైనా ప్రశ్నిస్తున్న వారిపై ఇలా భౌతికదాడులు వారిని బెదిరించి మానసికంగా ఇబ్బంది పెట్టి చంపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులపై జిల్లా ఎస్‌పి జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని దీనికి పూర్తి బాధ్యత జిల్లా మంత్రి సీతక్క వహించాలని వారిని కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పాఠశాలకు వన్నె తెచ్చేలా కృషి చేయాలి

### అందరూ మెచ్చేలా జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎ.రవీందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** తల్లిదండ్రులు, గ్రామస్థులు అందరూ మెచ్చేలా పాఠశాలకు వన్నె తెచ్చేలా విద్యార్థులకు కష్టపడి, ఇష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఏ.రవీందర్‌రెడ్డి సూచించారు. జిల్లాలోని కంబాలపల్లి జెడ్‌పిహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులు రామసహాయం శ్రీధర్‌రెడ్డి చొరవతో నూకల కృష్ణారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఆయన కుమారుడు నూకల మహేందర్‌రెడ్డి 2025 సంవత్సరంలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వెంపటి విఘ్నేష్(565)కు రూ.10వేలు, ధనుంజయ్ (554) రూ.6వేలు, శివ కుమార్ (534) 4వేలు, 500 మార్కులు దాటిన విద్యార్థులకు ఒక వెయ్యి రూపాయలు, మెంమెంటో సర్టిపికెట్ అందజేశారు. అలాగే పాఠశాలలో చదివి జెఇఇ 2025లో ఐఐటి సీటు సాధించిన విద్యార్థులు సాయిలేఖ్య, ప్రశాంత్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జి.ఉప్పలయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిఇఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని చెప్పడానికి ఈ విద్యార్థులే సాక్ష్యం అన్నారు. లిటిల్ టీచర్ విధానాన్ని అవలంబించి విద్యార్థిని విద్యార్థులు తమ ప్రతిభను సృజనాత్మకతను మెరుగు దిద్దుకుంటే ఉన్నత స్థాయికి చేరుకుంటారని డిఇఓ తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి బి.అప్పారావు, అమ్మ ఆదర్శపాఠశాల చైర్మన్ చిరంజీవి, ఉపాధ్యాయులు సోహన్, బి. శ్రీనివాసరావు, తిరుపతి, సతీష్‌కుమార్, సోమేశ్వర్, ఝాన్సీ, వీరభద్రం, కవిత, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, బి.కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, పిఎస్ హెచ్‌ఎం జి.లక్ష్మి, ఉపాధ్యాయులు రవి, కంబాలపల్లి గ్రామస్థులు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ ఉత్పత్తుల వల్ల పర్యావరణానికి హాని

### సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ ఉత్పత్తుల వల్ల పర్యావరణానికి హాని కలగటమేకాక అనేక అనర్థాలకు దారి తీస్తుందని సామాజిక వేత్త, పర్యావరణ ప్రేమిక్కులు నిమ్మల శ్రీనివ్వాస్ అన్నారు. జూన్ మూడవ తేదీ నో ప్లాస్టిక్ బ్యాగ్స్ డే ను పురస్కరించుకొని ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ ఉత్పత్తులను సాధ్యమైనంత వరకు తగ్గించి గుడ్డతో తయారుచేసిన చేతి సంచులను వాడాలని దీనిపై తాను గతంలో నిర్వహించిన అనేక కార్యక్రమాలను గుర్తు చేశారు. ఈ ప్లాస్టిక్ ఉత్పత్తులు భూమిలో కలవటానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుందని అనేక ఆధారాలకు దారితీస్తుందని రానున్న మన భవిష్యత్ తరాల వారి మనుగడకు ప్రమాదకరంగా మారుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, మేధావులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ సమస్యల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మెరుగైన వైద్యం కోసం ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/రాయపర్తి:** మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా నాయకులు ఐత రవి తల్లి ఐత ఎల్లమ్మ ప్రమాదవశాత్తు కాలుకు గాయమై హన్మకొండ గార్డియన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా గురువారం ఎల్లమ్మ వైద్య ఖర్చుల నిమిత్తం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహా నాయక్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మధు, రవీందర్‌రెడ్డి, ప్రసాద్, మాజీ సర్పంచ్ నర్సయ్య, మాజీ ఎంపీటీసీ రాంచందర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు సుధాకర్, వేణు, యూసఫ్, ఎల్లస్వామి, సాయిగౌడ్, సింహాద్రి, జీవన్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పల్లాను కలిసిన మండల నాయకులు



**ప్రజాపక్షం/తరిగొప్పుల:** ఇటీవల ప్రమాదానికి గురై శస్త్రచికిత్స అనంతరం హైధరాబాద్‌లోని వారి నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని మండల బీఆర్ఎస్ నాయకులు కలిశారు. ఎమ్మెల్యే పల్లా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని వాళ్లు ఆకాంక్షించారు. ప్రజా నాయకుడికి ఇలా జరుగడం దురదృష్టకరమన్నారు. త్వరలోనే ఆయన ప్రజా ఆశీర్వాదంతో త్వరగా కోలుకుంటారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధికార ప్రతినిధి చిలువేరు లింగం, మాజీ సర్పంచ్ దామెర ప్రభుదాస్, తాళ్లపల్లి పోచయ్యగౌడ్, మాజీ సర్పంచ్ సిద్దిని మహిపాల్, బత్తిని సురేందర గౌడ్, చింతల జైపాల్, సుంకరి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ సభ విజయవంతానికి భారీగా తరలిరావాలి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** హైధరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగే గ్రామస్థాయి పార్టీ అధ్యక్షులు ఆత్మీయ మహా సమ్మేళనానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరయ్యే బహిరంగ సభకు ప్రతి గ్రామం నుండి కార్యకర్తలు అదిక సంఖ్యలో తరలిరావాలని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో సభ విజయవంతం కోసం చేపట్టిన నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమవేశానికి ఝాన్సిరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శులు శ్రీను, పల్లె శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ పక్ష నేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు జరిగే సభ మన రాష్ట్రానికి, మన పార్టీ భవిష్యత్తుకు ఎంతో కీలకమైనదని ఇది కేవలం ఒక సభ మాత్రమే కాదు, ఇది ప్రజలతో మమేకమయ్యే మహాసమ్మేళనం అన్నారు. ప్రతి గ్రామం నుండి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హైధరాబాద్‌కు చేరుకుని సభ విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కుమారస్వామి, శ్రీరాములు, సురేష్ నాయక్, సురేష్, నాయకులు రాజేష్ నాయక్, శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, హరీష్, చంద్రయ్య, యాకాంతరావు, పాల్గొన్నారు.

## ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దందాపై స్పందించని ఎంఇఒ



**ప్రజాపక్షం/ నర్సంపేట :** ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దందాపై స్పందించని ఎంఈఓ అని, ఎంఈఓను వెంటనే సస్పెండ్ చేసి, ఫీజుల దోపిడిని అరికట్టాలని ఏఐఎఫ్డిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మార్త నాగరాజు డిమాండ్ చేశారు. నర్సంపేట పట్టణంలోని ఆర్డిఓ కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం ఏఐఎఫ్‌డిఎస్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ , ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న ఇక్కడ విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని, స్థానిక ఎంఈఓ కు అనేక మార్లు ఈ దోపిడి పై ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే ప్రవేట్ పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకొని విద్యార్థులకు న్యాయం చేయాలని, ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాల తో కుమ్మక్కైన నర్సంపేట ఎంఈఓ ను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. లేని పక్షంలో తమ సంఘం ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కల్లపల్లి రాకేష్ పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య వర్ధంతి

**ప్రజాపక్షం/ సంగారెడ్డిప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు జులై 4వ తేదీన శుక్రవారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాటు చేసినట్లు బీసి సంక్షేమ అదికారి అధికారి జగదీష్ గురువారం ఒకప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10.00 గంటలకు సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డి పల్లి హనుమాన్ ఆలయం సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి అదికారులు,ప్రజాప్రతినిధులు పూల మాలలు వేసి నివాళులు అర్పించే కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ వేడుకలకు ప్రజా ప్రతినిధులు ,అన్ని వర్గాల ప్రజలు హాజరు కావాలని బీసీ సంక్షేమ శాఖ అధికారి పిలుపు నిచ్చారు.

# 9న సార్వత్రిక సమ్మె

సింగరేణి కార్మిక సంఘాల జెఎసి నాయకులు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లిప్రతినిధి:** ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని జాతీయ కార్మిక సంఘాల నాయకలు పిలుపునిచ్చారు.భూపాలపల్లి ఏరియా కేటికే 5 ఇంక్లైన్ గని వద్ద సింరేణి కార్మిక సంఘాల జెఎసిఆధ్వర్యంలో సెకండ్ షిఫ్ట్ గేట్ మీటింగ్ ఫీట్ సెక్రటరీ దోర్నాల తిరుపతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.జెఎసినాయకులు మోటపలుకుల రమేష్,నూకల చంద్రమౌళి,జోగ బుచ్చయ్య,కంపేటి రాజయ్య,ఎస్ నరేష్,మాట్లాడుతూ కార్మికులు అనేక పోరాటాలతో ,త్యాగాలతో సాధించిన కార్మిక చట్టాలను సాధించుకుంటే కేంద్ర ప్రభుత్వం వాటిని కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా మార్చే కుట్రలకు ఒడిగట్టిందన్నా.మోదీ ప్రభుత్వ విధనాలకు వ్యతిరేకంగా ఈ నెల9న జరిగే సార్వత్రిక సమ్మెను కార్మికులంతా అధిక సంఖ్యలో పాల్గోని విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు కార్మికులను విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జెఎసినాయకులు ఎండి ఆసిఫ్ పాషా,గట్టు రాజు, భూపాల్,ఎన్ సదానందం,వెలగం మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# అటవీ భూమిని కబ్జా చేస్తున్నారని తహసీల్దార్‌కు ఫిర్యాదు



**ప్రజాపక్షం/రేగోడ్:** రేగోడ్ మండలంలోని దోసపల్లి శివారులో అటవీశాఖ భూమిని కబ్జా చేస్తున్నారుని సంగశ్వర్ తండాకు చెందిన మురళి నాయక్ గురువారం రేగోడ్ తాసాల్దార్ కు దత్తారెడ్డికి ఫిర్యాదు చేశారు అటవీ శాఖ అధికారులు కబ్జాదారులు కుమ్మక్కై భూమిని సాగు చేస్తున్నారని గతంలో ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని అన్నారు ఉన్నత అధికారులు స్పందించి అటవవీ శాఖ భూమి కబ్జా నుంచి కాపాడాలని వినతి పత్రంలో కోరారు

# యువజన రాష్ట్ర సహాయ కార్యదర్శిగా బొమ్మిడి సాయి కృష్ణ

**ప్రజాపక్షం/బెజ్జంకి:** తెలంగాణ రాష్ట్ర మేదరి మహేంద్ర సంఘం యువజన విభాగం రాష్ట్ర సహయ కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన బొమ్మిడి సాయికృష్ణ ఎన్నికైనట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎన్నికకు సహకరించిన గౌరవ అధ్యక్షులు వెంకట రాములుకు,రాష్ట్ర కమిటీ అధ్యక్షులు జోర్రిగల శ్రీనివాస్‌కు,ప్రధబూన కార్యదర్శి కోన రాజశేఖర్‌కు,కోశాధికారి పాతకోటి ఉమకు,ప్రచార కార్యదర్శి ప్యారసాని రమాకాంత్‌కు,పారిశ్రామిక సహకార సంఘాల రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల శ్రీనివాస్‌కు,రాష్ట్ర,జిల్లా,మండల కమిటీ సభ్యులుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఎస్ఐ రాజేశ్వర్ గౌడ్‌కు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



**ప్రజాపక్షం/ సంగారెడ్డి–ప్రతినిధి:** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎస్ఐ రాజేశ్వర్ గౌడ్ అధికార లాంచనాలతో అంత్యక్రియలు జరిపించారు. రాజేశ్వర్ ఎస్ఐ మృతి పట్ల జిల్లా ఎస్పి పరితోష్ ఫంకజ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ అంత్య క్రియలకు జిల్లా అదనపు ఎస్పి ఎ. సంజీవరావు హాజరైనారు. హైదరాబాద్ పిల్మ్ నగర్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎస్ఐయం ,రాజేశ్వర్ గౌడ్ బుదవారం రాత్రి 02.07.2025 రాత్రి బల్కంపేట ఎల్లమ్మ బోనాల బందోబస్తు ను ముగించుకొని తన కారులో ఇంటికి సంగారెడ్డికి వస్తుండగా మార్గమధ్యలో సంగారెడ్డిరూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో గల చెర్యాల ఎక్స్‌రోడ్డు వద్ద తేది గురువారం 03072025 సుమారు రాత్రి 1.30 గంటల సమయంలో రోడ్డు ప్రమాదం జరిగి చికిత్స కొరకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. ఈ సందర్బంగా అదనపు ఎస్పి ఎ సంజీవరావు మాట్లాడుతూ యం .రాజేశ్వర్ గౌడ్ ఎస్ఐ 1990 లో జిల్లా పోలీసు శాఖలో కానిస్టేబుల్ గా నియామకమై ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్ లలో సాదారణ విధులతో పాటు స్టేషన్ రైటర్‌గా విధులను నిర్వహించారు. అనంతరం జిల్లా టెక్నికల్ కంప్యూటర్ విభాగంలో సుమారు 15 సంవత్సరాలుగా ఐటిసెల్ ఇంచార్జీగా విధులను నిర్వహించారు. ఆయనకు బార్య గాయిత్రి, ఇద్దరు పిల్లలు సంతానం కలరని తెలిపాడు. రాజేశ్వర్ గౌడ్ ఎస్ఐజిల్లా పోలీసు శాఖలో అందించిన సేవలను కొనియాడుతూ ఆయన మృతి పట్ల సంతానం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు జిల్లాపోలీసు శాఖ ఎల్ల వేళలా అండగ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డిఎస్పీ సత్తయ్య గౌడ్, ఆర్ఐ రామరావు, ఆర్మూడ్ సిబ్బంది ఐటీ సెల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్‌ను పరామర్శించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి



**ప్రజాపక్షం/పాపన్నపేట :** పాతలింగయ్యపల్లి సర్పంచ్ రాణి భర్త , ఏడుపాయల ఆలయ మాజీ డైరెక్టర్ కిష్టయ్య ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. గురువారం కిష్టయ్య దశదినకకర్మకు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దేవేందర్‌రెడ్డి, మండల ముఖ్య నాయకులతో కలసి లింగయ్యపల్లి మాజీ సర్పంచ్ రాణి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. తెలంగాణ ఉద్యమం నాటి నుంచి మరణిచేంతవరకు బిఆర్ఎస్ పార్టీకి ఆయన చేసిన సేవ మర్చిపోలేనిదని గుర్తుచేశారు. ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎఎంసి చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ ఆలయ కమిటి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, సొసైటీ చైర్మన్ దత్తు, నాయకులు తదితరులు ఉన్నారు.

# కొడకంచి బ్రదర్స్ సేవలు అభినందనీయం



**ప్రజాపక్షం/శివ్వంపేట :** మండల పరిధిలోని చండి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో కడుపేదరికంలో ఉండి చదువుకుంటున్న విధ్యార్థులకు శివ్వంపేటకు చెందిన కొడకంచి నర్సింహాగౌడ్ తన సొంత ఖర్చులతో ఉచితంగా నోట్‌బుక్స్, గైడ్స్, పెన్నులు ఉచితంగా అందజేశారు. పేదరికంలో ఉన్నవారికి సహాయం చేయడంలో ఎంతో సంతృప్తి కలుగుతుందని అన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు సురేందర్, పాఠశాల సిబ్బంది విధ్యార్థుల తరుపున అబినందనలు తెలిపారు.

# భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** భార్య కాపురానికి రావడంలేదని మానస్థాపంతో భర్త ఉరి వేసుకోని ఆత్మహత్యకు చేసుకున్న సంఘటన జగదేవ్‌పూర్ మండలంలోని నిర్మల్ నగర్‌లో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి స్థానిక ఎస్ఐ చంద్రమోహన్ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్ గ్రామానికి చెందిన కర్రె కిరణ్ (27) గత ఐదు సంవత్సరాల క్రితం ప్రేమ పెండ్లీ చేసుకోని జగదేవ్‌పూర్‌లో నివాసం ఉంటున్నాడు. వారికి ఇద్దరు కుమార్తెలు జన్మించారు. అయితే ఇటీవల కాలంలో భార్య భర్తల మధ్య కుటుంబ వ్యవహారాల్లో మనస్పర్థలు తలెత్తి కాపురానికి రావడంలేదని తెలిపారు. దింతో అతడు మనస్థాపం చెంది శనివారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకోని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 ద్వారా గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అతనిని పరీక్షించిన వైద్యులు అప్పటీకే మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతుని తండ్రి మల్లేషం ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకోని విచారణ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి..

మోడల్ స్కూల్‌ను తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి



**ప్రజాపక్షం/బెజ్జంకి:** విద్యార్థులకు విద్యాతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మండల ప్రత్యేక అధికారి ఏ.మల్లేశం సూచించారు.గురువారం మండల పధిలోని మోడల్ స్కూల్‌ను అకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సంధర్భంగా పాఠశాలలోని పరిసరాలను,వంటగదిని, విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు మోను ప్రకారం భోజనాన్ని అందించాలని,పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎండిఎం సూపర్వైజర్ ఇంచార్జ కవిత,ప్రిన్స్‌పల్ మాలోతు సంగీత, సిబ్బ ంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాల పెంపు కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి

ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు జగదీశ్వరయ్య




**ప్రజాపక్షం/ సంగారెడ్డిప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాల ల్లోనే నాణ్యమైన విద్యతో పాటు మౌళిక సదుపాయాలు కల్పన లో కూడా అగ్రగామిగా ఉందని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోదిస్తూ విద్యార్థుల ద్వారానే సమాదానాలు రాబట్టాలని ప్రాథమిక పాఠశాల ప్రదాన ఉపాద్యాయులు ,రాష్ట్ర ఉత్తమ ఉపాద్యాయ ఆవార్డు గ్రహీత పెండోటి జగదీశ్వరయ్య అన్నారు. గురువారం రంజోల్ ప్రాథమిక పాఠశాలో హెచ్‌ఎమ్ ఆద్వర్యంలో జరిగిన ఉపాద్యాయులు ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ప్రవేశాల పెంపు కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రభుత్వ పాఠశాల్లోనే విద్యార్థులకు నాణ్యమైన భోదన ఉంటుందని తెలుపుతూ రంజోల్ వార్డులో ఇంటింటికి తిరిగి పిల్లల తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. వారంలో ఒకసారి టెస్టులు నెలకు ఓసారి యూనిట్ టెస్టులు నిర్వహిస్తున్నామని ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా ఉదయం అల్పాహారం, మాద్యాహ్న భోజనం, మెనూ అమలు చేస్తున్నామని చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఉపాద్యాయురాలు శకుంతల ,వీణ, సబినాబేగం పాహిస్త సాజీద్, మొహమ్మద్ ,అఖిల్, మంజుల ,హాపీర్ఘు అహిమద్ స్వప్ప ,జ్యోతి తదితరులున్నారు.

# శివ్వంపేటలో బిఎల్‌ఓలకు శిక్షణ



**ప్రజాపక్షం/శివ్వంపేట :** మండల కేంధ్రమైన శివ్వంపేటలోని రైతు వేదికలో గురువారం తహసీల్దార్ కమలాద్రి ఆధ్వర్యంలోబిఎల్‌ఓలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్‌రెడ్డి హాజరయ్యారు. రానున్న స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన నియమాలను వివరించారు.కార్యక్రమంలో తహశీల్దార్ కమలాద్రి, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

### ఎంపిడిఒ బాబు



**ప్రజాపక్షం/కమలాపూర్:**ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్యులు నిర్లక్ష్యం చేయకుండా మెరుగైన వైద్యం అందించాలని మండల అభివృద్ధి అధికారి గుండె బాబు తెలిపారు. కమలాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఎంపిడివో ఆకస్మికంగా సందర్శించి వైద్యుల పనితీరును ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ నరేష్, డాక్టర్ నాగరాజు లను అడిగి తెలుసుకున్నారు. పరిశీలనలో భాగంగా ఎంపిడివో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... ఆసుపత్రిలో రక్త, మూత్ర పరీక్షలతో పాటు ఈసీజీ ఎక్సరే అన్ని రకాల పరీక్షలు నిర్వహించడానికి నాణ్యమైన పరికరాలు వైద్యులు అందుబాటులో ఉన్నారని అన్నారు. అనవసరంగా ప్రైవేట్ ఆసుపత్రులకు రోగులు వెళ్ళకుండా ప్రభుత్వ ఆసుపత్రిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలసాని రమేష్ గౌడ్, ఆసుపత్రి వైద్యులతో పాటు ల్యాబ్ టెక్నీషియన్ చందు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/కమలాపూర్:**ఈనెల 5న ఉదయం 10 గంటలకి కమలాపూర్ మండల ఎంపిడివో కార్యాలయంలో దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకంలో భాగంగా కమలాపూర్ మండలంలోని అన్ని గ్రామాల నిరుద్యోగ యువతి, యువకులకు ఉచిత శిక్షణ, ఉపాధి మేళ నిర్వహించనున్నట్లు కమలాపూర్ మండల కమలాపూర్ ఎంపిడివో బాబు తెలిపారు. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం గ్రామీణ ప్రాంతాలలోని పేద నిరుద్యోగ యువతి, యువకులకు కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్ కమ్యూనికేషన్స్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, లాజిస్టిక్స్ కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇచ్చి అనంతరం ప్రముఖ కార్పొరేట్ కంపెనీల యందు ఉద్యోగ అవకాశం కల్పించబడునని అన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫాం, స్కాలర్‌షిప్స్, కేంద్ర ప్రభుత్వం సర్టిఫికేట్ ఆఫ్ ఇండియా, రాష్ట్ర ప్రభుత్వం చే ఎంప్లాయిమెంట్ జనరేషన్ మార్కెటింగ్ మిషన్ సర్టిఫికేట్ ఇవ్వబడునని అన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని అన్ని గ్రామాల నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగం చేసుకోగలరని ఆయన కోరారు.

# సిగాచి బాధితులను పరామర్శించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు



**ప్రజాపక్షం/సంగారెడ్డిప్రతినిధి:**సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి పార్మా పరిశ్రమలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాద భాదితులను వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న వారిని సిపిఐ రాష్ట్ర కార్యాదర్శివర్గ సభ్యులు వీర్ల ప్రకాశ్‌రావు గురువారం పరామర్శించారు. చికిత్స పొందుతున్న బాదితులతో మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. వారి ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని వైద్యాధికారులను కోరారు. అక్కడున్న బాదిత కుటుంబాలతో మాట్లాడారు. సిపిఐ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడే పరిస్తితులు పునరావృతం కాకుండా పరిశ్రమలపై పటిష్టమైన పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం బాద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఆయన వెంట సిపిఐ నాయకులు ఉన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్‌భూపాలపల్లిప్రతినిధి:**ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు ఉపాధ్యాయులు విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు.బుధవారం ఆయన భూపాలపల్లి మండలంలోని ఎస్ఎం కొత్త పల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి పాఠాలు బోధించారు.విద్యార్థులు చదువు పట్ల ఆసక్తి పెరిగేలా అభ్యసన సామర్థ్యాలు మెరుగయ్యేలా ఉపాద్యాయులు తగిన చర్యలు చేపట్టాలని ఇందుకోసం అదనపు సమయం కెటాయించాలని అన్నారు.పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తక్కువడగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్ పిల్లలను చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.ఐదవ తరగతిలో నలుగురు విద్యార్థులు ప్రయివేటు పాఠశాల నుండి ప్రభుత్వ పాఠశాలలో చేరిన సందర్భంగా ప్రయివేటు ప్రభుత్వ పాఠశాలల్లో వ్యత్యాసం ఎంటని అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్యాభ్యాసం జరుగుతుందని ఉపాద్యాయులు మంచిగా పాఠాలు బోధిస్తున్నారని తెలపగా విద్యార్థులను అభినందించారు.విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు పూర్తి స్థాయిలో పుస్తకాలు అందేలా చూడాలని సూచించారు.అంగన్వాడీ కకేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల నమోదు సంఖ్య గర్భిణీలు,బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను అంగన్వాడీ టీచర్ను అడిగి తెలుసుకున్నారు.చిన్నారుల ఆరోగ్యం,మాతృ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అంగన్వాడీ కార్యకర్తలు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఆరోగ్య సమ సమాజానికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఈఓ రాజేందర్,ఎంపిడిఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపితోనే బిసిలకు న్యాయం



**ప్రజాపక్షం/మహాదేవపూర్;**బిజెపిపార్టీతోనే బిసిలకు న్యాయం జరుగుతుందని బిజెపిపార్టీ మండల నాయకుడు కన్నెబోయిన ఐలయ్య యాదవ్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు.బిజెపి పార్టీ బిసిలను మోసం చేసిందని బిసిసంఘం డివిజన్ నాయకుడు విజయగిరి సమ్మయ్య వ్యాఖ్యలను ఖండించారు.బిజెపి పార్టీ సమ న్యాయంతో ముందుకు వెళ్తుందని,బిజెపి పార్టీపై బురదజల్లే ప్రయత్నం చేయడం మానుకోవాలని హితవు పలికారు.బిజెపిపార్టీ బిసిలకు పెద్దపీట వేస్తుందని దానిలో భాగంగా నేడు ఒక బిసిదేశ ప్రాధాని అయ్యారని,బిసి ముద్దుబిడ్డ బండి సంజయ్‌ను బిజెపి పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునిగా నియమించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు.సంఘాల పేరుతో పనికి మాలిన మాటలతో తమ పబ్బం గడుపుకోవాలని చూసే కొంతమంది నాయకుల మాటలను నమ్మవద్దని తెలిపారు.మీ పార్టీ ఎంతమంది బిసిలకు గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అధ్యక్ష పదవులు ఇచ్చిందో తెలపాలని కనీసం మండలి చైర్మన్‌లుగా నైనా నియమించారా అని ప్రశ్నించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రా రావుకు శుభాకంక్షలు తెలిపారు.

# బిజెపి అధ్యక్షుడు రాంచందర్‌రావును కలిసిన మానుకోట నాయకులు



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :**బిజెపి తెలంగాణ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రాంచందర్‌రావును మానుకోట బిజెపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బిజెపి మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు వల్లభు వెంకటేశ్వర్లు, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్, మానుకోట పార్లమెంట్ కోకన్వీనర్ సింగారపు సతీష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు గడ్డం అశోక్, మానుకోట పట్టణ ప్రధాన కార్యదర్శులు పల్లె సందీప్, వెన్నమల్ల సందీప్, గిరిజన మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్ నాయక్ తదితరులు రాంచందర్‌రావును కలిసిన వారిలో ఉన్నారు.

# పాఠశాల గోడలపై విద్యార్థులకు అర్థమయ్యేలా పలు చిత్రాలు




**ప్రజాపక్షం/కొండపాక:**కుకునూరుపల్లి మండలం మాత్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు రాజ నర్సింలు పాఠశాల గోడలపై విద్యార్థులకు అర్థమయ్యేలా పలు చిత్రాలను వేశాడు.రంగురంగుల చిత్రాలతో పాటు సరళమైన పద్ధతుల్లో అర్థమయ్యే పదాలను గోడలపై బోమ్మలు వేశారు.గురువారం ఎంఈఓ బచ్చలి సత్తయ్య పరిశీలించి సదరు ఉపాధ్యాయుడిని అభినందించారు.విద్య బోధనతో పాటు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో చిత్రాలు వేయడం అభినందనీయం అన్నాడు.అలాగే మండలంలోని కాశనగర్, రామచంద్రపూర్ ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించి పలు సూచనలు చేశారు.ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నా రు.

# సర్పంచ్‌గా పోటీకి సిద్ధం

**ప్రజాపక్షం/కాటారం;**స్థానిక సంస్థల ఎన్నికల్లో తాను పోటీకి సిద్ధంగా ఉన్నానని ఫర్జానా బేగం మోయిజుర్రహ్మాన్ ఖాన్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు.రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,తెలంగాణ ప్రదేశ్ కాంగ్రేస్ కమిటీ జనరల్ సెక్రెటరీ ఆశీర్వాదంతో రిజర్వేషన్ అనుకూలిస్తే కాటారం మండలం ఇబ్రహీం పల్లి గ్రామ సర్పంచ్‌గా పోటీ చేయడానికి సిద్దంగా ఉంటానని తెలిపారు.అవకాశం వస్తే గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు.గ్రామ సర్పంచ్‌గా రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,టిపిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు సహాకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో ఉంచి గ్రామ ప్రజలు కోరుకున్న విధంగా జిల్లాలో ఉత్తమ గ్రామ పంచాయితీగా తీర్చి దిద్దడానికి కృషి చేస్తానని తెలిపారు.

# లోకల్ వాహన దారులనూ వదలని టోల్ ప్లాజా వసూళ్లు

### కారు యజమానుల నిరసన

**ప్రజాపక్షం/కాటారం;**మండలకేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్నా కాటారం మండల వాహన దారులను టోల్ ప్లాజాలో వసూళ్లు చేస్తున్నారని కాటారం మండల కేంద్రానికి చెందిన కారు యజమానులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.గురువారం టోల్ ప్లాజా వద్ద బైఠాయించి ఆందోళన చేసారు.ఈ సందర్భంగా రెండు గంటల పాటు వాహన రాకపోకలు నిలిచిపోయాయి.దీంతో వాహనదారులు అవస్థ పడ్డారు.ఈ సందర్భంగా కారు యజమానులు మాట్లాడుతూ మండల కేంద్రానికి 10 కిలో మీటర్ల దూరం ఉన్నా తమవద్ద నుండి టోల్ వసూళ్ల చేయడం ఏంటని ప్రశ్నించారు.నిబంధనలకు విరుద్ధంగా టోల్ ప్లాజా వారు వసూళ్లకు పాల్పడుతున్నారని అధికారులు వాహన దారులకు న్యాయం చేయాలని కోరారు.

# రాయితీ కంది విత్తనాలు పంపిణీ

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** కంది పంట సాగు విస్తీర్ణం పెంపుదలకు ప్రభుత్వం జాతీయ ఆహార మిషన్ పప్పు దినుసులు 2025 పథకంలో భాగంగా గురువారం జగదేవ్‌పూర్ ఎఒ వసంతరావు రైతులకు రాయితీ కంది విత్తనాలు పండిణీ చేశారు. మండలానికి అదనంగా కేటాయించిన 20 కంది విత్తనాల 4 కిలోల సంచులను రైతులకు అందజేశారు. మండలంలో కంది సాగు విస్తీర్ణం పేంచేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పంట సాగులో రైతులకు సూచనలు, సలహాలు అందించేందుకు తాము అందుబాటులో ఉంటామాని వ్యవసాయాధికారి తెలిపారు.

# మానవత్వం చాటుకున్న శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/రాయపర్తి:** రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళను పోలీసుల సహాయంతో హాస్పిటల్‌కు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు శ్రీనివాస్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే వరంగల్ రంగశాయి పేట వద్ద వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాయ్యాయి. అటుగా వెళ్తున్న శ్రీనివాస్‌రెడ్డి మహిళను చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు.

# పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆర్‌జెడి

ప్రజాపక్షం/వెంకటాపూర్ : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాలను వరంగల్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆర్‌జెడి సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలలో విద్యార్థిని, విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, టీచర్ల డైరీలు, మధ్యాహ్న భోజన రిజిస్టర్, అటెండెన్స్ రిజిస్టర్,బియ్యం స్టాక్ రిజిస్టర్,పాఠశాలలో నిర్వహిస్తున్న అన్ని రికార్డులతో పాటుగా లైబ్రరీ రూమ్, ఐఎఫ్ పి ప్యానల్ వివరాలు, సైన్స్ ల్యాబ్,కంప్యూటర్ ల్యాబ్, ప్రొజెక్టర్ వివరాలు,డార్మెంటరీ,కిచెన్ రూమ్స్ లను సందర్శిస్తూ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.విద్యార్థుల సామర్థ్యాలకు సంబంధించి నిర్వహించిన లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాం ఎల్ ఐపి ఫౌండేషనల్ అండ్ లిటసి అండ్ న్యూమరస్సి ఎఫ్ఎల్ పికి సంబంధించిన మూల్యాంకం పేపర్లను తక్షణమే ఆన్లైన్ చేయాలని అదేవిధంగా మండల విద్యా వనరుల కేంద్రం నుంచి తీసుకున్న



పాఠ్యపుస్తకాలు,నోట్ బుక్స్,యూనిఫామ్ ల సమాచారాన్ని ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు.ఈ తనిఖీల్లో వారితోపాటుగా ములుగు జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ అర్షం రాజు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి. రాధిక,సీనియర్ ఉపాధ్యాయులు జనగాం బాబురావు,ప్రాథమిక పాఠశాల ఇన్చార్జి ఉపాధ్యాయులు చిన్న కేశవరావు,టి.రాజయ్య,ఫిజికల్ డైరెక్టర్ బి.వేణు,సిఆర్ పి కుమార్ పాధ్య తదితరులు పాల్గొన్నారు.

# మినీ ట్యాంక్ బండ్‌కు ప్రహరీ నిర్మాణం పూర్తి



ప్రజాపక్షం/సిర్పూర్ టి :మినీ ట్యాంక్ బండ్ వద్ద భద్రతా లోపాలు ఉండటంతో, సందర్శకుల రక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడిందని, అందుకే బుద్ధ కమిటీల పర్యవేక్షణలో ప్రహరీ నిర్మాణం చేపట్టినట్లు బుద్ధ ప్రచార కమిటీ అధ్యక్షుడు దుర్గం విక్రమ్ తెలిపారు. ఈ నిర్మాణ పనులు బుద్ధ కమిటీల పటిష్ఠ పర్యవేక్షణలో పూర్తయ్యాయని, సిర్పూర్ టి మండలంలోని మినీ ట్యాంక్ బండ్‌ను మరింత సురక్షితంగా, శుభ్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రహరీ ఏర్పాటుచేశామని గురువారం ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొంతకాలంగా ట్యాంక్ బండ్ పరిసరాల్లో భద్రతా లోపాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో కమిటీలు స్వయంగా చొరవ చూపి ప్రహరీ నిర్మాణాన్ని చేపట్టాయి. ఇది సందర్శకులకు భద్రత కల్పించడమే కాక, పరిసరాల పరిశుభ్రత మెరుగుపడేందుకు కూడా తోడ్పడుతుందని తెలిపారు. కమిటీ సభ్యులు నిర్మాణ పనులను దగ్గరుండి పర్యవేక్షించారని, నాణ్యత విషయంలో రాజీపడలేదని స్థానికులు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.

# మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఇడి దుర్గాప్రసాద్



ప్రజాపక్షం/మందమర్రి:సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం తప్పనిసరిగా అందించాలని సాంఘిక సంక్షేమ శాఖ ఎస్‌సి ఇడి చాతరాజుల దుర్గాప్రసాద్ సూచించారు. గురువారం మందమర్రి పట్టణంలో పర్యటించిన ఆయన పాత బస్టాండ్ వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం, భాగ్యనగర్ కాలనీలోని బాలుర కళాశాల వసతి గృహం, శ్రీపతి నగర్‌లోని బాలుర పాఠశాల వసతి గృహాన్ని సందర్శించి, విద్యార్థుల హాజరు రికార్డులను, భోజన సరఫరా వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత హాస్టల్ వార్డెన్లదే అని, వంటగదిని పరిశుభ్రంగా ఉంచి, హాస్టల్ పరిసరాలను శుభ్రంగా నిర్వహించాలని, విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతిరోజూ విద్యార్థులతో మమేకమై, వారి బాగోగులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ తనిఖీ సందర్భంగా ఎఎస్‌ఓ రవీందర్, వార్డెన్లు తిరుమల, కిషోర్, శ్రీనివాస్ ఉన్నారు.

# న్యూస్ ఛానల్ ఆఫీసులపై దాడి పత్రికా స్వేచ్ఛను హరించడమే

మండల మాదిగ జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షుడు సందెల రాజు



ప్రజాపక్షం/హసన్ పర్తి : ప్రజలకు, ప్రభుత్వాలకు,ప్రతిపక్షాలకు మధ్య వారధిగా ఉంటూ నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పనిచేసే మీడియా కార్యాలయలపై, విలేకరులపై అమానుషంగా దాడి చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని, కొన్ని రోజుల నుండి కొన్ని న్యూస్ ఛానల్ లపై జరిగే దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు హసన్ పర్తి మండల మాదిగ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు సందెల రాజు మండల కేంద్రంలోని ఎంపిడిఓసమావేశపు హాలులోఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. కష్ట నష్టాలకోర్చి నిరంతరం ప్రజా సమస్యలను ప్రభుత్వాలకు తెలియజేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలిసేలా చేస్తున్నారని, రాజకీయ నాయకుల బండారాలను బయటపెడుతూ తమ జీవితం గురించి ఆలోచించకుండా ఎదుటివారి జీవితాలు బాగుండాలనే తపనతో 24 గంటలు పని చేసే మీడియాపై గూండాల్లాగా దాడి చేయడం చాలా హేయమైన చర్య అన్నారు. రాజ్యాంగానికి విరుద్ధమైన పనులు చేసే వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని, లేదంటే పర్యవసనాలు చాలా తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. మీడియా పై దాడి చేసిన వారు ఎంతటి వారైనా సరే వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని అన్నారు. మీడియాపై గౌరవం ఉన్న వారు, ప్రజాస్వామ్యవాదులు, ప్రభుత్వ పెద్దలు తక్షణమే స్పందించి పోలీస్ అధికారులు కూడా దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సింగారపు బాబు, రాజారపు బిక్షపతి, ప్రధాన కార్యదర్శి రామంచ మధుకర్, సహాయ కార్యదర్శి కొడపాక శ్రీకాంత్, ఎర్ర కుమారస్వామి, దేవ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత

వైద్యాధికారి డాక్టర్ సుమలత



ప్రజాపక్షం/ఏటూరునాగారం:సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ సుమలత అన్నారు. ఏటూరునాగారం మండలం రోహిర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ఏటూరునాగారం ఆకులవారి ఘనపురం ఆశ్రమ హైస్కూల్‌ను సందర్శించారు. పాఠశాలలో వైద్య శిబిరాలు నిర్వహించి వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం స్టోర్ రూమ్, వంటగది పాఠశాల పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచండని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వైద్యాధికారి డాక్టర్ సుమలత, సూపర్‌వైజర్ గంగమ్మ, పాఠశాల సిబ్బంది, ఏఎన్‌ఎం భాగ్యమ్మ, స్వరూప, ఆశాలు పాల్గొన్నారు.

# వృద్ధ దంపతులకు ఆర్థిక సహాయం



ప్రజాపక్షం/హసన్ పర్తి : ఎదుటి వ్యక్తి కన్నీరు తుడవడానికి రక్త సంబంధమో స్నేహ బంధమో, పేగు బంధమో, బంధుత్వమో అవసరంలేదని, పిడికెడు గుండెల్లో చిటికెడు మానవత్వం ఉంటే చాలని చాలని నిరూపించారు హసన్ పర్తి కి చెందిన కందుకూరి క్రిష్ణ మూర్తి. హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలానికి చెందిన వేల్పుల రాములు యాదవ్(74), గట్టమ్మ(70) వృద్ధ దంపతులు కడు పేదరికంలో జీవిస్తున్నారని తెలుసుకొని, వారి కొడుకు అంజియాదవ్ రెక్క ఆడితేగాని డొక్కాడని పరిస్థితిని తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన కందుకూరి కృష్ణమూర్తి వృద్ధ దంపతులకు 20 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వేల్పుల రాములు యాదవ్ గట్టమ్మ దంపతుల కుమారుడు వేల్పుల అంజి యాదవ్, కందుకూరి చంద్రమోహన్, వీసం కరుణాకర్ రెడ్డి వేల్పుల సంపత్ యాదవ్, కొమ్ము అంజి యాదవ్, మారం కుమార్ యాదవ్, వేల్పుల రమేష్ యాదవ్, వేల్పుల మహేందర్ యాదవ్, దాడి రణధీర్ యా దవ్, తోట చిన్న సారంగం ,తల కుక్కల మల్లయ్య, మాటేటి కుమారస్వామి, సంద్రు శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికలే లక్ష్యంగా బిఎస్‌పి ముందుకు



ప్రజాపక్షం/మందమర్రి : మంచిర్యాల జిల్లాలో జరగనున్న జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బహుజన్ సమాజ్ పార్టీ ముందుకు సాగుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్ స్పష్టం చేశారు. గురువారం మందమర్రి పట్టణ అధ్యక్షుడు గాజుల శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఒక కార్యక్రమంలో పలువురు యువకులు బిఎస్‌పిలో చేరారు. ఈ సందర్భంగా ముల్కల్ల రాజేంద్ర ప్రసాద్, షేక్ రహీం బాబా, ఎస్‌కె. వాజిద్, షేక్ సర్వే ఆలంలకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా బిఎస్‌పి అభ్యర్థులు బరిలోకి దిగుతారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులను ఇప్పటికే ఎన్నికలకు సన్నద్ధం చేశామని, జడ్‌పి చైర్‌పర్సన్ ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు

# సింగరేణిలో మారుపేర్ల సమస్యలను పరిష్కరించాలి



ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :సింగరేణి సంస్థ అభివృద్ధిలో నిరంతరం పాలుపంచుకుంటూ, మెడికల్ అన్‌ఫిట్ అయిన తర్వాత మారుపేర్ల సమస్యలను ఎదుర్కొంటున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బాధితులు దబ్బేటి అంజయ్య, జి. రాజయ్య యాజమాన్యాన్ని కోరారు. గురువారం నస్పూర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధితుడు దబ్బేటి అంజయ్య మాట్లాడుతూ 2021లో తాను అన్‌ఫిట్ అయ్యాను అని, మా అల్లుడికి ఉద్యోగం వస్తుందని ఆశించానని, కానీ మారుపేరు సమస్య కారణంగా విజిలెన్స్ అధికారులు ఉద్యోగాన్ని నిలిపివేశారని వాపోయారు. తమ సమస్య మాదిరిగానే సింగరేణి వ్యాప్తంగా అనేకమంది ఉద్యోగులు మారుపేర్లు, పేర్లలో అక్షర దోషాల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనివల్ల ఉద్యోగాలు రాకపోవడం, బెనిఫిట్స్ నిలిచిపోవడంతో ఆర్థికంగా, మానసికంగా ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత ఉన్నతాధికారులు, అలాగే కార్మికుల పక్షాన నిలబడే యూనియన్లు ఈ సమస్యలపై స్పందించి, మారుపేర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మోత్కూరి రవికుమార్, సందీప్ కూడా పాల్గొన్నారు.

# అంత్యక్రియల కోసం ఆర్థిక సహాయం



ప్రజాపక్షం /పెంచికల్ పేట్:మండలంలోని గుంట్లపేట్ గ్రామానికి చెందిన జాలరి వృత్తికి చెందిన గిరుగుల గంగయ్య బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంఎల్‌సి దండే విఠల్ ఆదేశాలతో, పోతపల్లి మాజీ సర్పంచ్ దాసరి చంద్రమౌళి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, అంత్యక్రియల కోసం రూ.5 వేల నగదు సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌సి దండే విఠల్ ఎల్లప్పుడూ ప్రజలతోపాటే ఉంటారు. మృతుడి కుటుంబానికి అన్ని వేళలా అండగా నిలవాలని మేము కృషి చేస్తాం" అని తెలిపారు. ఆయన వెంట గ్రామస్తులు గిరుగుల కొండయ్య, శిడం చీకటి, గిరుగుల మల్లేష్, బోయిరే వాగయ్య, సదాశివ్, శ్రీనివాస్, రాయమల్లు తదితరులు ఉన్నారు.

# అసత్య ఆరోపణలు మానుకోవాలి.. బహిరంగ చర్చకు రావాలి

## సింగల్ విండో డైరెక్టర్ ధర్ని మధుకర్



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** అసత్య ఆరోపణలు మానుకోవాలని, తగిన ఆధారాలు ఉంటే బహిరంగ చర్చకు సిద్ధం కావాలని సింగల్ విండో డైరెక్టర్, 21వ వార్డు ఇంచార్జ్ ధర్ని మధుకర్ మాజీ ఎంపిపి బేర సత్యనారాయణకు సవాల్ విసిరారు. గురువారం నస్పూర్‌లోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 2వ తేదీన స్థానిక ప్రెస్ క్లబ్‌లో బేర సత్యనారాయణ చేసిన అసత్యపు ఆరోపణలను తాను పూర్తిగా ఖండిస్తున్నట్లు ధర్ని మధుకర్ తెలిపారు. నిరాధారమైన వ్యాఖ్యలు మంచివి కావని హితవు పలికారు. తాను ఎవరి భూములను అక్రమంగా తీసుకోలేదని, ఒకవేళ ఆక్రమణకు పాల్పడినట్లు ఆధారాలతో నిరూపిస్తే, దైవసాక్షిగా ఆ భూములను ఈ ప్రాంత ప్రజలకు బేషరతుగా పంచుతానని పత్రికా ముఖంగా తెలియజేశారు. తగిన ఆధారాలతో శనివారం సర్వేనెంబర్ 8లోని రైస్ మిల్లు వద్దకు వస్తే తాను అన్న మాటలకు కట్టుబడి ఉంటానని, బేర సత్యనారాయణ తన పబ్బం గడుపుకోవడానికి, రాజకీయ లబ్ధి కోసం అనేక పార్టీలు మారారని విమర్శించారు. తనను గెలిపించి రాజకీయంగా పదవులు కట్టబెట్టిన 21వ వార్డు ప్రాంత ప్రజలకు ఏ విధంగానూ సహాయం చేయలేదని, ఎంపిపి స్థానంలో ఉండి రొడ్డ రాజేశం, గాజుల విజయలక్ష్మి, తిప్పని పద్మ, పోతురాజుల రమేష్ వంటి పేద ప్రజలకు సంబంధించిన భూములను అక్రమంగా లాక్కొని వారిని అనేక రకాలుగా ఇబ్బంది పెట్టిన విషయాన్ని మర్చిపోయావా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శాఖాంబరధారిణిగా వారాహి మాత దర్శనం



**ప్రజాపక్షం / మందమర్రి :** మందమర్రిలోని శ్రీ హరిహర దేవస్థానం పక్కన గల సిఐఎస్‌ఎఫ్ బ్యారక్‌లో కొలువైన అమ్మవారి దేవాలయంలో వారాహి మాత నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. నవరాత్రులలో ఎనిమిదవ రోజైన నేడు, వారాహి మాత శాకంబరధారిణి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వారాహి మాత నవరాత్రులను నిర్వహిస్తున్న నాగమణి, హేమలత, స్వరూప, లలిత, అన్నపూర్ణ, గీత మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా ఈ ఆలయంలో అమ్మవారు కొలువై ఉన్నారని, భక్తుల కోరికలు తీర్చే ఇలవేల్పుగా అమ్మవారు పూజలందుకుంటున్నారని కీర్తించారు. శుక్రవారం నవరాత్రుల ముగింపు రోజున వారాహి మాత హోమము, తీర్థ ప్రసాద వితరణ ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

# పొన్నారంలో ఇంటింటికీ ఆరు మొక్కల పంపిణీ



**ప్రజాపక్షం / మందమర్రి :** పెరుగుతున్న వాతావరణ కాలుష్యాన్ని నివారించే లక్ష్యంతో ప్రతి ఇంట్లో చెట్లు పెంచాలని, దీనిలో భాగంగానే ఇంటింటికి ఆరు మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మండల ఎంపిడిఓ రాజేశ్వర్ తెలిపారు. గురువారం పొన్నారం గ్రామపంచాయతీ పరిధిలో మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఎంపిడిఓ రాజేశ్వర్‌తో పాటు పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ సునీత, హౌసింగ్ ఎఇటిఎ. రాజమల్లు, జ్యోత్స్న, పంచాయతీ కార్యదర్శి హరీష్, కాంగ్రెస్ నాయకులు సంతోష్ కుమార్, బేర సమ్మయ్య, గ్రామస్తులు, మహిళలు బొజ్జ రాజమణి, సంధ్య, ముప్పిడి అంజయ్యలతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఈద లింగయ్య పాల్గొన్నారు.

# సబ్సిడీ విత్తనాలు సద్వినియోగం



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :** ప్రభుత్వం సబ్సిడీలో అందిస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రామకృష్ణ అన్నారు. గురువారం కాగజ్‌నగర్ మండలంలోని చారిగాం గ్రామంలో జాతీయ ఆహార భద్రత పథకం (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం) ద్వారా రైతులకు కంది, జొన్న విత్తనాలు ఉచితంగా పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎఒ రామకృష్ణ మాట్లాడుతూ సబ్సిడిపై విత్తనాలు తీసుకున్న రైతులు వాటిని సరిగా నిల్వ చేయడం, సరైన సమయంలో వాటడం ద్వారా అధిక దిగుబడి సాధించి అధిక ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. సబ్సిడి విత్తనాలు కావల్సిన రైతులు పట్టాపాస్ పుస్తకం, ఆధార్ కార్డు తీసుకు రావాలని సూచించారు. అనంతరం రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

# బ్యాగుల పంపిణీ



**ప్రజాపక్షం / రామకృష్ణాపూర్ :** రామకృష్ణాపూర్‌లోని ఠాగూర్ స్టేడియం వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో యువత జనం కోసం స్వచ్ఛంద సంస్థ దాతల సహకారంతో 40 మంది విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాలకు సంబంధించిన సమస్యలను కమిషనర్ రాజు దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారం కోసం పాఠశాల చుట్టూ కంచె, గేట్ ఏర్పాటు చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. యువత జనం కోసం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేష్ మాట్లాడుతూ సంస్థకు సహాయం చేస్తున్న దాతలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు గణేష్, తిరుపతి, కరుణాకర్, మెప్మా కోఆర్డినేటర్ శ్రీధర్, పేరెంట్స్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక క్షేత్రాల్లో కోతుల బెడద..



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్, నస్పూర్ ప్రాంతాలలోని కార్మిక క్షేత్రాలలో ప్రజలు కోతుల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లలోకి చొరబడి తినుబండారాలను ఎత్తుకెళ్లడంతో పాటు, ఇంట్లో ఉన్నవారిపై దాడికి పాల్పడుతున్నాయి. రహదారి వెంబడి నడిచే వారిపై, ఉదయం వేళ పాఠశాలకు వెళ్లే పిల్లలను సైతం భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఈ వానరాల దాడికి తట్టుకోలేక వృద్ధులు, పిల్లలు, సాధారణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కార్మిక క్షేత్రాలలో సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకొని, సంబంధిత అధికారులు స్పందించి వానరాలను సురక్షితంగా జనజీవనానికి దూరంగా వదిలిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ఫర్టిలైజర్ షాప్ తనిఖీ



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :** కాగజ్‌నగర్ మండలంలోని ఫర్టిలైజర్ షాప్‌ను గురువారం ఎఇఒ సృజన తనిఖీ చేశారు. షాపులోని స్టాక్‌ను పరిశీలించి దుకాణంలో ఉన్న ఎరువులు, విత్తనాల నిల్వలను తనిఖీ చేశారు. లైసెన్స్, ధరల పట్టిక, స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించి నాణ్యతను పరిక్షించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించాలని సూచించారు. రైతులకు విత్తనాలు లేదా ఎరువులు కొనుగోలు చేయకుండా జాగ్రత్త పడాలని, ఏమైనా అనుమానాలుంటే అధికారులకు తెలియజేయాలని సూచించారు.

# పెన్నులు, బ్యాగుల పంపిణీ

**ప్రజాపక్షం /మందమర్రి :** మండలంలోని అందుగులపేట ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బిజెపి రాష్ట్ర యువ నాయకులు రవి సాగర్ ఆధ్వర్యంలో, జిల్లా అధ్యక్షులు నంగునూరు వెంకటేష్ విద్యార్థులకు పెన్నులు, బ్యాగులు, నోట్‌బుక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే కాకుండా, విద్యార్థులకు అన్ని మౌలిక వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందించడానికి భారతీయ జనతా పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. దీనిలో భాగంగానే బిజెపి నాయకులు రవి సాగర్, రాములు పాఠశాలలోని విద్యార్థులకు అవసరమైన బ్యాగులు, పెన్నులు, నోటుబుక్కులు పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర నాయకులు అందుగుల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు జనార్ధన్, ఇన్‌చార్జి సంజీవరావు, పట్టణ అధ్యక్షుడు నరేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులున్నారు.

# ఘనంగా ప్రపంచ మెకానిక్ దినోత్సవం





**ప్రజాపక్షం / జన్నారం :** జన్నారం పట్టణంలో గురువారం ప్రపంచ మెకానిక్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మెకానిక్‌లు మాట్లాడుతూ జూలై 3వ తేదీన తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉండడం ఎంతో సంతోషకరంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మెకానిక్ టూవీలర్ యూనియన్ గౌరవ అధ్యక్షులు మార్కండేయ, ప్రధాన కార్యదర్శి రహీం, ప్రచార కార్యదర్శి ఇమ్రాన్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముజఫర్ అలీ ఖాన్, బీసీ సంఘం అధ్యక్షులు కోడూరు చంద్రయ్య, కడార్ల నరసయ్య, రాము, బి. నరేష్, తదితరులు పాల్గొన్నారు.

**మందమర్రి :** మధ్యతరగతి జీవనానికి ద్విచక్ర వాహనం ఒక ముఖ్యమైన సాధనంగా మారిందని, అటువంటి వాహనాల నిర్వహణలో మెకానిక్‌ల కృషి ప్రశంసనీయమని మెకానిక్ యూనియన్ సభ్యులు అన్నారు. ప్రపంచవ్యాప్తంగా జూలై 3వ తేదీని ద్విచక్ర వాహన మెకానిక్ దినోత్సవంగా జరుపుకుంటున్న సందర్భంగా గురువారం మందమర్రి పాత బస్టాండ్ ప్రాంతంలో మెకానిక్ యూనియన్ సభ్యులు జెండా ఎగురవేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మెకానిక్ యూనియన్ అధ్యక్షుడు చిరుత మల్లేష్ పటేల్ జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. నేటి రోజుల్లో ద్విచక్ర వాహనాలు లేని ఇల్లు లేదని, అవి లేకుండా మనుగడ సాగించడం కష్టమని అన్నారు. ఈ వాహనాలకు సాంకేతిక పరికరాలను సరిచేయడంలో, నిర్వహించడంలోనైపుణ్యంకలిగిన మెకానిక్‌ల కృషిని, ప్రాముఖ్యతను గుర్తించాలని, ప్రత్యేకించి ప్రపంచ మెకానిక్ డే జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. బైక్ మెకానిక్‌లుఉపాధ్యక్షుడుఎర్రోజు బ్రహ్మం, ప్రధాన కార్యదర్శి ముత్యంపల్లి భాస్కర్, మర్రి రాము, మెరుగు కిషన్, కస్తూరి సత్యం,కుమార్,ఓ.శ్రీనివాస్,తుమ్మల శ్రీనివాస్, సురేష్,మున్నా,ఓదెలు,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తు

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటి 2025 26 విద్యా సంవత్సరానికి గాను అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు యూనివర్సిటి నోటిఫికేషన్ జారీ చేసినట్లు కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె. శ్రీదేవి, కో ఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ పాస్ అయిన లేదా తత్సమాన అర్హత కలిగిన అభ్యర్థులు ఓపెన్ డిగ్రీ బిఎ, బి.కాం, బి.ఎస్‌సిలో ఆన్‌లైన్‌లో ప్రవేశాలు ఆన్‌లైన్ ద్వారా పొందాలన్నారు. ప్రవేశాలు పొందేందుకు ఆగస్టు 13 చివరి తేది అని తెలిపారు. యూనివర్సిటి వెబ్ సైట్‌లో వివరాలు నమోదు చేసుకుని రెండు సెట్‌ల జిరాక్స్ కాపీలు కళాశాలలో ఇవ్వాలని తెలిపారు. డిగ్రీలో మధ్యలో ఆపివేసిన వారు యూనివర్సిటి పర్మిషన్‌తో అడ్మిషన్ కంటిన్యూ చేస్తున్న 2,3 సంవత్సరం (2016 సంవత్సరం నుండి) సెమిస్టర్ విద్యార్థులు, ప్రస్తుతం డిగ్రీ విద్య అభ్యసిస్తున్న 2021 22 నుంచి 2024 25 సంవత్సరం విద్యార్థులకు తమ ట్యూషన్ ఫీజును ఆన్‌లైన్ ద్వారా ఆగస్టు 13వ తేదీలోగా చెల్లించాలని ఇతర వివరాలకు 9160144943, 949414314 లేదా 9866398678ను సంప్రదించాలని సూచించారు.